# గంగ పొంగింది

డాక్టర్ ఎమ్. సుగుణరావు

ఏమిటీ, ఆకాశం తెల్లబోతూ కనిపిస్తుంది ఎప్పుడూ? నీలిమేఘాలేవి? తన కళ్ళలోంచి చిలికే కన్నీళ్ళు తప్ప తన కోసం ఆకాశం కళ్ళు చెమర్చవేమిటి? తలెత్తి పైకి చూస్తూ స్వగతంలో అనుకొంటున్న ఆ రాజయ్య మాటల వెనుక యాభయ్యేళ్ళ జీవితం వుంది. గంపెడు సంసారాన్ని పోషించే ఆమధ్య తరగతి మనిషికి చేదు అనుభవాలు ఎదురవడం మామూలే అయినా ఈ మధ్యనే ఎదురైన ఈ చేదునిజం మింగుడు పడలేదు. జబ్బు నించి కోలుకొన్న వాడికి రోగం తిరగబెట్టినట్లు... సముద్రం ఈది ఒడ్డుకు చేరబోతున్నవాడిని మొసలి పీకినట్లు బాధపడినాడు. కొద్దిపాటి నీటి చుక్కలు చాలు తమ ఆకలిదప్పలు తీర్చడానికి, తనలో తానుగొణుక్కు న్నాడు. అతని కుటుంబానికి ఏకైక ఆధారం అతనికున్న కొద్దిపాటి పొలం. అది వారి నిరాశల చీకట్లో మిణుకుమనే దీపం. అది ప్రస్తుతం బీడు వారింది. బావి తవ్వించడం అనేదే అతను ప్రస్తుతం చేయగలిగేది. ఆ బావి అతని బిడ్డల భావి జీవితానికి పునాది . తాను పోయినా బావి మిగులుతుంది, పాతాళంలోంచి పెల్లుబికే గంగ తన వాళ్ళ దరిద్రాన్ని కడిగేస్తుంది. ఇదీ అతడి ఆశ! అయినా బావికి అయ్యే ఖర్చు అంతు పట్టని సమస్య అయింది. రాజయ్యకు తాతలు మిగిల్చిన ఇల్లుంది. ఆ ఇంటి వెనక




కూతురు పెళ్ళి కోసం చేసిన అప్పుంది. ఆ అప్పు విషయం గుర్తు కొచ్చేసరికి రాజయ్యకు పాపారావు జ్ఞప్తికి వచ్చాడు. అతను నల్లగా, తుమ్మ మొద్దులా వుంటాడు. క్రూరమైన చూపులు, దెబ్బలాడుతున్నట్లుగా కనిపించే ముఖం. పాపారావుకి రెండు రైసుమిల్లులున్నాయి. రాజయ్య పొలం సరిహద్దుగా యాభై ఎకరాల పొలం వుంది. అంతేకాక రోజూ బంగారు బాతు గుడ్లు పెట్టే వడ్డీ వ్యాపారం వుంది. అతను పెట్టే గడువుకి అప్పుచెల్లించకపోతే అవన్నీ అతని పాలవుతాయి. రాజయ్య అప్పు కోసం పాపారావు దగ్గర కెళ్ళాడు. భయపడుతూ వెళ్ళాడు. తోడేలు దగ్గరకెళ్ళే మేకలా చేతులు కట్టుకొని భయంగా నిల బడ్డాడు. ఇదివరకు చేసిన అప్పుతీర్చలేదు. ఏమంటాడో ఏమో అనుకుంటూ తలొంచుకొని–

"ధర్మ ప్రభువులు కరుణించాలి. ఐదు వేలు అప్పు కావాలి. బావి తవ్వించుకొని, మీ పేరు చెప్పి రెండు పూటలా తింటాం.." మెల్లగా చెప్పాడు.

రాజయ్య మాటలు విని అతని వంక చూడకుండా ఆలోచిస్తూ కళ్ళు మూసుకున్నాడు పాపారావు.

రాజయ్య అలా ఆశగా నించున్నాడు. ఐదునిమిషాల తర్వాత–

"ఏమిటయ్యా, డబ్బు కావాలా, మా దొడ్లో కొబ్బరి చెట్టేమన్నా కాయలు కాయడం మానేసి నోట్లు కాస్తోందనుకున్నావా? అసలు నీ ఉద్దేశం ఏంటి? ఇదివరకే ఇంటి మీద అప్పుంది. ఎక్కణ్ణుంచి వస్తుంది పుష్ప ఫలంగా రావాలి అంటే–" కసురుకొంటూ అరిచాడు పాపారావు. ఆ మాటలకు కొంచెం బెదిరినా మరలా ధైర్యం తెచ్చుకొని "పొలం కూడా తనఖా పెడతాను..." అన్నాడు. ఆ మాటలకు సంతృప్తి పడి "సర్లే రేపు కనబడు" అన్నాడు పాపారావు.

ఆ తరవాతి రోజు నుంచీ చాలాసార్లు వెళ్ళి కనబడుతూనే వున్నాడు. కాని, డబ్బు మాత్రం చేతికి అందలేదు. ఒక రోజు బాంక్‌కు శలవనీ, ఇంకో రోజు గుమస్తాలేడనీ మరో రోజు ముహూర్తం బాగాలేదనీ ఇలా చాలాసార్లు తిప్పాడు. అయినా విసుగు చెందకుండా ప్రతిరోజూ వెళుతూనే వున్నాడు. ఆ రోజు రాజయ్య అదృష్టవశాత్తూ అన్నీ అనుకూలంగా వున్నాయి.


–"అయ్యా అవతల పనులాగిపోతున్నాయి. కూలీలు పైసలు లేకుండా పని చెయ్యడం లేదు. తొందరగా కావాలి అయ్యా..!" అన్నాడు రాజయ్య రెండు చేతులూ జోడించి. పాపారావ్ గదిలో ఫేన్ తిరుగుతోంది. నోట్లో చుట్ట పొగలు కక్కుతోంది. ఎక్కడి నించో అలలు అలలుగా వయొలిన్ సాధన చేస్తున్న ధ్వని వినపడుతోంది. దగ్గరగా కుక్క పిల్లిని తరుముతూ భౌ..భౌ మంటోంది. పక్కింట్లో ముసలమ్మ దగ్గుతూ ఎవరినో తిడుతోంది. కావ్..కావ్ మంటూ కాకులు గోల చేస్తున్నాయి. దొడ్లో కొబ్బరాకు పూడిపడి ఎవరి నెత్తిమీదో పడింది. పాపారావు చుట్ట కాల్చడం పూర్తి చేశాడు. "నీ పొలం,ఇల్లు కలిపి క్రియ దస్తావేజు రాస్తాను ఆరు నెలలే గడువు, అది దాటితే అవి నా పరం అవుతాయి. అది నీకిష్టమేనా?" అన్నాడు పాపారావు. రాజయ్య ఆ ఒప్పందానికి అంగీకరించి సంతకం పెట్టాడు. ఇంతలో కెవ్వుమనే పిల్లి ఆక్రందన గాల్లో తేలుతూ మెల్లగా వచ్చింది. రాజయ్య చేతిలో దస్తావేజులు పాపారావు బీరువాలోకి, బీరువాలోని నోట్లు రాజయ్య చేతిలోకి వచ్చాయి.

** ** **

రాజయ్య బావి తవ్వకం ప్రారంభించాడు. రోజులు వారాలయ్యాయి. వారాలు నెలలుగా మారాయి. పచ్చనోట్లు చేతులు మారాయి. రోజులు




గడిచే కొద్దీ డబ్బు తరుగుతున్న కొద్దీ అతనిలో ఆశలు అడుగంటుతున్నాయి. విధి చివరికి ఆతన్నే వెక్కిరిస్తోంది. బావి తవ్వడం ప్రారంభించి అప్పటికి ఐదు నెలలు గడిచాయి. అలా కొంత కాలం గడిస్తే ఈ పొలంకూడా అతనిది కాకుండా పోతుంది. పాతాళగంగ పైకి ఉబికి, బీటలు దీసిన అతని భూమిని ప్రక్షాళనం చేస్తే చాలు అతడి కుటుంబానికి మంచి రోజులొస్తాయి. అదే ఆశతో ఎదురు చూస్తున్నాడు. తన గడువు తీరే ఆఖరి రోజైనా గంగమ్మ కరుణించదా, ఆ తల్లిని చూసి ఏ ధర్మాత్ముడైనా కనికరించి అప్పివ్వడా అనే మొండి ధైర్యంతో బావి తవ్విస్తున్నాడు. ఒకరోజు రాజయ్య పొలం గట్టుమీద కూర్చొని వున్నాడు. పాపారావు గడువు ఇంకో రోజులో పూర్తి కాబోతోంది. రాజయ్య చాలా ఉద్విగ్నతతో కూర్చున్నాడు. దూరంగా బావి తవ్వుతూ కూలీలు "పాతాళ గంగమ్మా.. పైకి ఉబికి రావమ్మా.. కోటి దండాలు నీకు కరుణించుమా తల్లీ.. అంటూ పాడుతున్న పాట లీలగా వినిపిస్తోంది. వారి గునపాల శబ్ధాలు అతని గుండెల మీదే చప్పుడు చేస్తున్నాయి. ఇంతలో ఒక కూలీ పరిగెత్తుకుంటూ వచ్చి ఆయాసపడుతూ – "బాబూ, మేం మంచి సందడిలో తవ్వుతుంటే గునపాలకు ఖణేల్, ఖణేల్‌మని తగిలినాది ఏమిటో చూద్దుమా, అది పెద్ద బండరాయి. కరగదు, ఇరగదు, ఇక మా వల్ల కాదు. మిషనుతోటే పనవ్వుద్ది.. ఆ కూలీ ఇంకా ఏదో చెప్పబోయేసరికి రాజయ్య తూలి క్రిందపడ్డాడు. కళ్ళల్లో నీళ్ళు నిల్చిచాయి. ఆ క్షణం వరకూ వెలిగిన ఆశాదీపం ఆరిపోయింది. బావిలో బండ పడింది. తన గుండెల్లోనే ఆ బండ పడినట్లుగా అనిపించిందతనికి. ఆ బరేడ పగలాలంటే ఎన్నో వేలు ఖర్చు చెయ్యాలి. రాయిపడ్డ బావిని చూసి అప్పివ్వడానికి ఎవరూ ముందుకు రారు. తనివ్వడేమిటి చెయ్యడం? తనలో తాను ప్రశ్నించుకున్నాడు. తరతరాలుగా వస్తున్న పాత లోగిలి లోంచి ఏ




చెట్టు కిందకో పోతాడు తలదాచుకోవడానికి. తన ఇల్లు, పొలం పాపారావు పాలవుతాయి. అలాంటి వడ్డీ వ్యాపారులున్నంత కాలం తమ లాంటివారి అప్పులు పోవు, అప్పు చేసిన వాళ్ళే పోవాలి– రాజయ్య మనసులో దుఃఖం అధికం అయింది. జరిగిన విషయం పాపారావుకి తెలిసింది. ఆ రోజే అతను పెట్టిన గడువు ముగిసేరోజు. రాజయ్య పెళ్ళాం పిల్లలతో వీధిలోకి వెళ్ళాల్సిన రోజు. పాపారావు వడ్డీల యజ్ఞంలో మరో మధ్య తరగతి మనిషి సమధి అయ్యేరోజు. ఆ రోజు పాపారావు తన అనుచరులతో రాజయ్య పొలం దగ్గరకొచ్చాడు. రాజయ్య ప్రాధేయపడ్డాడు, మరిన్ని రోజుల గడువిమ్మని ...పాపారావ్ చిద్విలాసంగా నవ్వుతూ,"చూడు రాజయ్యా, ఎవరు ఎంత చేసుకుంటే అంతే జరుగుతుంది, ఎవరి కర్మకు ఎవరు కర్తలు?! నేను ఇదివరకటి జన్మలో ఎంతో పుణ్యం చేసుకున్నాను. అంచేత నీ పొలం,ఇల్లు నా ఆధీనంలోకి వచ్చాయి. నువ్వు చేసిన పాపమే నిన్ను శిక్షించింది. అంతే" అన్నాడు.

పాపారావుతో పాటూ వచ్చిన భృత్యుగణం అదే కర్మ సిద్ధాంతాన్ని బలపరిచారు. పాపారావుతో పాటు వచ్చిన సిద్ధాంతి అతని వంక తిరిగి–

"రాజయ్య చుట్టూ శనిగ్రహం తిరుగుతోంది. అంచేతే అతను తవ్వించే బావిలో బండరాయి పడింది. ఆ శని పోవాలంటే మేకపోతును బలిఇచ్చి శాంతి జరిపించాలి. లేకుంటే మిమ్మల్ని శని చుట్టుకుంటుంది... అలా సిద్ధాంతి సలహా చెప్పేసరికి మేకను బలి ఇద్దామని నిర్ణయించాడు పాపారావు. అందుకు ముహూర్తం నిర్ణయించారు. మేక పిల్లను కొనడానికి తన మనుషుల్ని సంతకు పంపాడు పాపారావు. నాగరికత వికసించింది. పురాణయుగం నించి పరమాణుయుగం వరకూ ఎదిగాడు బుద్ధి జీవి అయిన మానవుడు. అయినా బలులు, శాంతులు అంటూ పాతరాతి యుగంలోకి తిరిగి ప్రయాణిస్తున్నాడని అక్కడ ఎవరికీ అనిపించలేదు.

బావిలో బండపడిన దుర్ఘటన రాజయ్యను కోలుకోలేకుండా చేసింది. మంచం పట్టాడు. తన ఇల్లు ఇప్పుడు పాపారావు పాలవుతుంది. తనిప్పుడు ఎక్కడ తలదాచుకుంటాడు? దుఃఖంలో ఇల్లు వదలలేకపోతున్నాడు. పూలమ్మినచోట కట్టెలు అమ్మబోయే పరిస్థితి ఎదురుకాబోతోంది. అందుకే ఊరువదిలి పోదామని నిశ్చయించాడు తన కుటుంబంతో సహా–

** ** **

పాపారావుకు మహదానందంగా వుంది. రాజయ్య పొలాన్ని ఆనుకునే అతడి యాభై ఎకరాల పొలం వుంది. రాజయ్యది పల్లం భూమి. బావి



## నవ్య దీపావళి



గగనాన దీపాలు కొడిగట్టి
నేలపై చిమ్మ చీకట్లు వ్యాపించె
అదిగో అదది – అది అర్థరాత్రి
ఇంకెక్కడివి మానాభిమానాలు
రాకాసి మూకలో పడిననాడు
ఆక్రందనలెన్ని చేసినా
అది అరణ్యరోదనమే!
కొండంత అండవెనుక నున్నవాడు
స్వైరవిహారము చేసే వరాహం
కాలమ్మువానికే కలిసొచ్చె కాబోలు
నడిరోడ్డుపై వస్త్రాపహరణం
విజయానికిదే చిహ్నమని
జయజయధ్వానాలు చేశారు వాడి నేస్తాలు
దీనికిక అంతమ్ము లేనేలేదా!
స్త్రీ జాతికి మోక్షమ్ము రాదా!
రాక్షసత్వానికి తెరపడనెపడదా!
సత్యభామలై
మగువలు ముందుకురావాలి
కలియుగ నరకాసురులను వధించి
ముమ్ముందుకు పోవాలి
ఆనాడే నిజంగా
దీపావళి
చెల్లెలా! నవ్య దీపావళి

–డాక్టర్ యన్. అప్పన్న

చాలా లోతు తవ్వించాడు. మిషనుతో బండను పగల కొట్టిస్తే గంగ పెల్లుబికి రావడం ఖాయం – వర్షాలు లేక పంటలు సరిగా పండడం లేదని బాధలేదు. బావి నుంచి నీరుతోడి పంటలకు నీళ్ళు పెట్టొచ్చు ఇలా అనుకుంటూ ఆనందపడ్డాడు. అతడు ప్రతిరోజా ఐదింటికే లేచి పొలం దగ్గరకు బయలుదేరతాడు. అక్కడే కాలకృత్యాలు తీర్చుకుంటాడు. రోజా ఇది అతడి నిత్యకృత్యం. ఆ రోజు మామూలుగా బయలుదేరాడు తన ఆస్తిలో క్రొత్తగా చేరిన "భూలక్ష్మిని" ఒకసారి చూసుకుందామని. అతని అడుగులు తమకంగా పడుతున్నాయి. గాల్లో తేలుతూ నడుస్తున్నాడు. రాజయ్య పొలం చేరేసరికి అతనిలో ఉత్సాహం కట్టలు తెంచుకుంది. బావిని చూడడానికి ముందుకు కదిలాడు. ఇంకా వరలు బిగించలేదు. చుట్టూ ఇసక, మట్టి. నేలంతా చిత్తడిగా వుంది. ఇసుకలో కాలుపెట్టి, తవ్విన బావిలోకి తొంగి చూశాడు. పైసా ఖర్చు లేకుండా బావి తన పాలయినందుకు మురిసిపోతూ వెనకకు తిరగబోయాడు. ఆ చిత్తడి నేలలో కాలు జారింది. కాలు తీసుకోబోయేసరికి పట్టు తప్పింది. అర క్షణంలో అతడు సహాయం కోసం అరిచాడు. ఇంకా వెలుగు రేకలు విచ్చుకోలేదు. రైతులు పొలాల్లోకి చేరుకోని సమయం అది. అతని కేక అక్కడ ప్రతిధ్వనించింది. సరిగ్గా బావిలోని బండ మీదే పడ్డాడు.

** ** **

పాపారావు పాలేరు గంట తర్వాత చూశాడు బావిలో పాపారావు శవాన్ని. చూసేసరికి బావి నిండా రక్తం, చిట్లిన తల – ఊళ్ళోకి పరిగెత్తుకుంటూ వెళ్ళాడు. అతను ఒంటరిగా వెళ్ళాడు. ప్రమాదవశాత్తూ పడ్డాడు. మొత్తానికి తగిన శాస్తి జరిగింది అనుకున్నారు. కొంత మంది అతని దౌర్జన్యాలకు నాశనమయిన వారు మేక పిల్లను బలి ఇద్దామనుకుంటే తనే బలయిపోయాడు. ఆ స్థలం మీద మమకారం పెంచుకోవడంతో అరిష్టం ఎదురైంది.. ఇలా ఎన్నెన్నో వ్యాఖ్యానాలు కర్మకాండ జరపాలంటే శవాన్ని బయటకు తియ్యాలి అందరూ భయపడ్డారు. పాపారావు పాలేర్లు సంశయిస్తూ నించున్నారు. డబ్బులిస్తా, శవాన్నిబయటకు తియ్యండి... పాపారావు పెద్ద కొడుకు బ్రతిమాలాడు. పాపారావు బతికున్నప్పుడు అతని డబ్బుకోసం ఈగల్లా చుట్టుముట్టినవారు అక్కడ కనిపించలేదు. శవాన్ని తీద్దామని కొంతమంది ముందుకొచ్చారు. వాళ్ళను మిగతావాళ్ళు వెనక్కు లాగారు. పాపారావు బలయ్యాడు. ఇంకెంత మంది బలికావాలో అనుకుంటూ తాత్సారం చేశారు. రాజయ్యకు విషయం తెలిసింది. అతడిలో మానవత్వం వుంది. తనను అప్పుల పాల్చేసి, తన ఆస్తి లాక్కున్న పాపారావు మీద కోపం కలగలేదు. అంతట నీర్సంలోనూ బావిలోకి దిగాడు తాళ్ళు కట్టుకొని. అతడికి భయం లేదు. జరగాల్సిన అరిష్టం జరిగిపోయింది. ఇంకేం జరిగినా అందుకు తను సిద్ధం. అలా అనుకుంటూ అతను శవాన్ని బయటకు తీశాడు. రెండు చేతులు జోడించి రాజయ్యకు నమస్కరించాడు. కర్మకాండ పూర్తయింది. భూమి కోసం ప్రాకులాడిన పాపారావు ఆ భూమిలోనే కలిసిపోయాడు. తన తండ్రి శవం కాలుతున్నంతసేపూ పాపారావుకొడుకులో నిర్వేదం–ఒక నిర్ణయానికొచ్చాడు. ఆ తర్వాత రెండు రోజులకు రాజయ్య ఇంటికి వెళ్ళాడు. తన మనసులోని మాట చెప్పాడు. రాజయ్యకు ఆశ్చర్యం, ఆనందం. ఇది కలా, నిజమా అనుకున్నాడు. తను ఊరొదిలి పోనక్కరలేదు. పాపారావు జప్తు చేసుకున్న పొలం తనకిచ్చేస్తాడట– ఇంటిమీది అప్పు మెల్లగా వీలయినప్పుడు తీర్చుకోవచ్చు– ఈ మాత్రం సహాయం చాలు. రాజయ్య పొంగిపోయాడు తన పట్ల అతడు చూపిన ఔదార్యానికి. పాపారావు కొడుకు ఈ నిర్ణయం తీసుకోవడానికి కారణం రాజయ్యమీద జాలితో కాదు, పాపభీతితో తండ్రి మరణంతో అంతర్మథనం వెంట తను ఇంక ఆ భూమి మీద ఆశ చంపుకోవాలి. లేకుంటే తన కుటుంబం నాశనమవుతుందనే భయం కొద్దీ అతడా నిర్ణయం తీసుకున్నాడు.

** ** **

ఆరోగ్యం నుంచి పూర్తిగా కోలుకోవడానికి రాజయ్యకు నెల పట్టింది. ఈలోగా అతడు తవ్వించిన బావి ఊరివాళ్ళకు చెత్తకుండీ అయింది. చెత్తుకుప్పలు, కాగితాలు, పెంట దానిలో పోశారు. ఒక విధంగా తమ అసూయ ఆ విధంగా వెళ్ళగక్కారు. రాజయ్య నాశనం అవుతాడని సంతోషించిన వాళ్ళు అతడి పొలం అతడికి చేరడం సహించలేకపోయారు. అందుకే అతడి బావి నిండా చెత్తపోశారు. నెల తర్వాత రాజయ్య వచ్చి చూసేసరికి తవ్వించిన బావి నిండిపోయింది. బండను పగలకొట్టించేందుకు డబ్బు సహాయం చేశాడు పాపారావు కొడుకు. ముందుగా చెత్తను తొలగించాలి. దాన్ని తియ్యడం కన్నా మంట పెట్టడమే మంచిదనిపించింది. లోపల మంట పెట్టాడు. జ్వాలలు ఉవ్వెత్తున లేచాయి. గంటన్నరకు పైగా చెత్త కాలుతూనే వుంది. ఆ తర్వాతే జరిగింది ఆ అద్భుతం.. ఎవరూ ఊహించనిది, కలలోకూడా జరగనిది. బాంబు పేలినట్లు, ఆకాశం ఉరిమినట్లు, పెద్ద శబ్దం చేస్తూ పగిలిపోయింది బండ. ఆ బండ పగిలి పాతాళ గంగ ఉబుకుతూ పైకొచ్చింది. ఊళ్ళోవాళ్ళకందరకూ ఒక ఆశ్చర్యం–

ఒక భయం–

రాజయ్య మీద ద్వేషం కొద్దీ చెత్తపోస్తే అతడికి మంచే జరిగింది. పాపారావు రక్తంతో శాంతి జరిగింది. మొత్తానికి బండ పగలడానికి తను బలయ్యాడు. అందరి నోటా ఇదేమాట.

చెత్తా, చెదారం, పెంట కలిస్తే గాస్ వుడుతుందనీ, దాన్ని మండిస్తే బండరాళ్ళే కాదు, ఇంకా కఠినశిలలే పగులుతాయనీ, అలాగే బావిలో బండ పగిలిందనీ, అది యాధృచ్ఛికమనీ ఎవరూ అనుకోలేదు. శాస్త్రీయంగా జరిగిన ఆ సంఘటన ఆ వూరివాళ్ళలో మూఢ నమ్మకాన్ని మరింత పెంచింది. ఏమయితేనేం రాజయ్య కుటుంబం బాగుపడింది. బావి నిండా నీళ్ళు రాజయ్య మనసులా స్వచ్ఛంగా. పాపారావు లాంటి వడ్డీ వ్యాపారులకు హెచ్చరికగా గంగమ్మ పొంగింది.